సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



సమస్యలు పరిష్కరించండి

మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రి సత్యవతి రాథోడ్‌ను అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకులు కోరారు. 10లో▸

నేడు ఎంఎంటీఎస్ రద్దు

సాక్షి, సిటీబ్యూరో: నిర్వహణపరమైన కారణాల దృష్ట్యా నగరంలోని పలు రూట్లలో శుక్రవారం 19 ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి-నాంపల్లి, ఫలక్‌నుమా-లింగంపల్లి, నాంపల్లి-లింగంపల్లి, ఫలక్‌నుమా-రామచంద్రాపురం, ఫలక్‌నుమా-నాంపల్లి, రూట్లలో రాకపోకలు సాగించే రైళ్లు రద్దు కానున్నాయి.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

షాద్‌నగర్‌టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ డిపో నుంచి శ్రీశైలం దేవస్థానానికి ప్రత్యేక బస్సు నడుస్తుందని డీఎం ఉష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14 (మంగళవారం) నుంచి నిత్యం ఉదయం 8 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైతే సంఖ్య పెంచుతామని వెల్లడించారు.

న్యూస్‌రీల్

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన



తలకొండపల్లి: పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు పొందొచ్చని సెంటర్ సిల్క్ బోర్డ్ సైంటిస్ట్ వినోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కోరింతకుంటతండాలో గురువారం పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వినోద్‌కుమార్‌తో పాటు జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఏడీ ముత్యాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో పట్టు పురుగుల పెంపకం చేపట్టి అధిక ఆదాయం పొందొచ్చన్నారు. పట్టు పురుగుల పెంపకం 21 రోజుల ప్రక్రియ అని, ఈ పంట మొత్తం ఐదు దశల్లో ఉంటుందన్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా పెంపకాన్ని చేపట్టవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ సబ్సిడీలు అందిస్తున్నాయని చెప్పారు. ఇతర పంటలతో పోల్చితే రూ.లక్షల్లో ఆదాయం ఆర్జించవచ్చన్నారు. పట్టు గూళ్లకు ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. అనంతరం పట్టు పురుగుల పెంపకం ఎలా చేపట్టాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పెట్టుబడి ఎంత పెట్టాలి, సాగు కాలపరిమితి ఎంత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఏపీఓ కృష్ణ, కార్యదర్శి పరమేశ్వర్, రైతులు రఫీ, శక్రు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదులో వేగం పెంచాలి

జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న డీఏఓ గీతారెడ్డి

కేశంపేట: క్షేత్రస్థాయిలో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాల నమోదులో వేగం పెంచాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాల రైతువేదికను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 13వ విడత పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాలో జమవుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఈకేవైసీ చేయించుకునే విధంగా చూడాలని సూచించారు. రైతువేదికల్లో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, రాము, సమూద్దీన్, లలిత సుష్మిత, సమీన, సుధ పాల్గొన్నారు.

సీబీఐ, ఈడీకి అప్పగించాల్సి రావొచ్చు

నిజాం భూముల వివాదంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సివిల్ సూట్ 13, సివిల్ సూట్ 14 బ్యాచ్ కేసులన్నింటినీ ముఖ్యంగా నిజాం భూముల వివాదాలను సీబీఐ, ఈడీకి అప్పగించాల్సి వస్తోందేమో అని హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. దీర్ఘకాలికంగా ఈ కేసులను విచారణ జరపాల్సి వస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరు గ్రామంలోని 93 ఎకరాల భూ వివాదంపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ కేసులోని పలు అంశాలపై విచారణ జరపాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. చట్టపరమైన వారసులకు భూమిని పంచాలని, అప్పటివరకు మూడో పార్టీకి భూమి చెందకుండా స్టే విధించాలని వారు (పిటిషనర్లు) కోరుతున్నారు. 2021, జూన్‌లో హయత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ఈ భూమికి సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్ జరపకుండా నిషేధం విధించారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా, సింగిల్ జడ్జి.. నిషేధాన్ని ఎత్తివేసేందుకు నిరాకరించారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై అప్పీల్ చేసినా డిస్మిస్ అయ్యాయి. కొద్దికాలానికి సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చారు. దీనిపై కూడా కొందరు హైకోర్టును ఆశ్రయించడం షాకింగ్ విషయం. ఈ నేపథ్యంలో మొత్తం అంశంపై సీజే ధర్మాసనం స్టే విధించింది. ఆ 93 ఎకరాల పరిధిలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని ఆదేశించింది. విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.

కబ్జాలపై ఉక్కుపాదం

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

- ఎట్టి పరిస్థితుల్లో అన్యాక్రాంతం కానివ్వం
- ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు
- ధరణి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి
- అధికారులు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లాల్సిందే..
- గతంలో ఇక్కడ జేసీగా పని చేసిన అనుభవం ఉంది
- 'సాక్షి'తో కొత్త కలెక్టర్ హరీశ్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'గతంలో ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది. జిల్లా రెవెన్యూ యంత్రాంగంపై పూర్తి పట్టుంది. ఏమూలన ఏ భూములు ఉన్నాయి? ఎక్కడెక్కడ ఎన్నెన్ని ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉన్నాయి? వంటి అంశాలపై కొంత అవగాహన ఉంది. ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తాం. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఎట్టిపరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వం' అని కలెక్టర్ ఎస్.హరీశ్ అన్నారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడారు.

జిల్లాకు రావడం సంతోషంగా ఉంది

గతంలో జేసీగా పని చేసిన జిల్లాకే పూర్తిస్థాయి కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉంది. కలెక్టర్‌గా ప్రత్యేక రంగాలు, ప్రాధాన్యతలు అంటూ ఏమీ లేవు. ప్రభుత్వ పాలసీలను సమర్థవంతంగా అమలు చేయడం ఒక్కటే లక్ష్యం. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు అర్హులకు అందేలా చూస్తాం. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తాం. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తాం.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చూస్తాం. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పెద్దపీట వేస్తాం. సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం.

ఆరోపణలు తగ్గాయి

ధరణి సాంకేతిక పరిజ్ఞానంతో భూములకు రక్షణ పెరిగింది. ఒకసారి ధరణిలో భూ వివరాలు నమోదైన తర్వాత వారి పేర్లు తొలగించడం సాధ్యం కాదు. ధరణి వచ్చిన తర్వాత భూ సంబంధిత సమస్యలు పెరిగాయని చాలామంది అంటున్నారు. నిజానికి అది తప్పు. గతంలో ఎంఆర్‌ఓలు, ఆర్డీఓలకు మ్యాన్‌వల్‌గా దరఖాస్తులు అందేవి. వారిపై అనేక ఆరోపణలు వచ్చేవి. ప్రత్యక్ష దాడులకు దిగేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం లభించింది. వివాదాలు, రెవెన్యూలో అవినీతి కూడా తగ్గిపోయింది.

నాలుగైదు నెలల్లో అన్నీ క్లియర్

గతంలో భూములు కొనుగోలు చేసిన వారు మ్యూటేషన్ చేయించుకోకపోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయం తెలియక చాలామంది ధరణిని తప్పుబడుతున్నారు. క్షేత్రస్థాయి రిపోర్టుల ఆధారంగా పీఓబీ జాబితా నుంచి ప్రైవేటు భూములను తొలగిస్తాం. జిల్లాలో ఇప్పటి వరకు 1.90 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో గతంలో ఇక్కడ పని చేసిన కలెక్టర్ అమయ్ కుమార్ 1.50 లక్షల దరఖాస్తులకు పరిష్కారం చూపారు. ఇది మేజర్ అచీవ్‌మెంట్. నేను కూడా సోమవారం నుంచి ధరణి దరఖాస్తులను పరిశీలిస్తాను. నాలుగైదు నెలల్లో పెండింగ్ క్లియర్ చేస్తాం.

'ప్రజావాణి'లో కూర్చొంటాను

జిల్లా అధికారులు విధిగా ఫీల్డ్‌కు వెళ్లాల్సిందే. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై నిరంతరం నిఘా ఉంచాలి. ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా అధికారులదే. విధులకు గైర్హాజరయ్యే అధికారులను ఉపేక్షించే ప్రసక్తే లేదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో స్వయంగా కూర్చొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తాను. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండేలా చూసి, సమస్యల సత్వర పరిష్కారానికి ప్రయత్నిస్తాం.

వందశాతం వసూలు చేయాల్సిందే

- మున్సిపాలిటీల్లో సమస్యలు పరిష్కరించాలి
- కమిషనర్లతో సమీక్ష సమావేశంలో కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మున్సిపాలిటీల్లో పన్నులు వందశాతం వసూలు చేయాలని కలెక్టర్ హరీశ్ ఆయా మున్సిపాలిటీల కమిషనర్లను ఆదేశించారు. ప్రజాసమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపి, అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయా మున్సిపాలిటీలపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలకు ఉన్న లక్ష్యాలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. షాపుల మంజూరు, ట్రేడ్ లైసెన్స్ డేటా మొత్తం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని కోరారు. మార్చి 31లోగా మున్సిపాలిటీల పరిధిలోని అన్ని రకాల పన్నులను డిజిట్ రూపంలో వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

సురక్షిత ఆహారం ప్రధానం



మాట్లాడుతున్న పాలసీ నిపుణుడు డాక్టర్ నర్సింహారెడ్డి

కడ్తాల్: రేపటి ఆరోగ్యవంతమైన సమాజానికి సురక్షిత ఆహారాన్ని అందించడమే ముఖ్యమని పాలసీ నిపుణుడు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి, వ్యవసాయ రంగ నిపుణుడు, సీనియర్ జర్నలిస్ట్ పంతంగి రాంబాబు అన్నారు. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, కౌన్సిల్‌ఫర్ ఎర్త్ లీడర్‌షిప్ అండ్ సస్టైనబిలిటీ ఆధ్వర్యంలో గురువారం అన్మాస్‌పల్లి పంచాయతీ పరిధిలోని ది ఎర్త్ సెంటర్‌లో నేషనల్ సేఫ్ ఫుడ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సురక్షిత ఆహారం ఒక ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆహార భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పంతంగి రాంబాబు మాట్లాడుతూ.. పాతకాలపు ఆహార విధానాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పంట సాగులో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. డాక్టర్ సుధా చేప్యల సురక్షిత ఆహారం.. అలవాట్లు, ఆరోగ్యంపై వివరించారు. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు నాగజ్యోతి, హారిక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆహార ప్రాముఖ్యత, ఆరోగ్యానికి ప్రతి మనిషికి అవసరమైన వివిధ రకాల ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి, సభ్యులు డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, కోటేశ్, వెంకటేశ్, వంశీకృష్ణ, శివ, అజయ్, కడ్తాల్, అన్మాస్ పల్లి సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి,శంకర్ పాల్గొన్నారు.

8,686 మంది ఓటర్లు.. 27 పోలింగ్ కేంద్రాలు

మార్చి 13న ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి ఎన్నిక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గానికి మార్చి 13న ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు గురువారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్‌టీయూ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు.రోజుకోమండలాన్ని చుట్టేస్తున్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎజెండాగా ప్రకటించుకుంటున్నారు. ఆయా ఉపాధ్యాయులను మచ్చిక చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఎన్నికలకు మరో నెల రోజులే గడువు ఉండటంతో ఎన్నికల్లో గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలో సుమారు 29 వేల మంది ఓటర్లు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఒక్క రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 8,686 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,590 మంది పురుషులు, 4,095 మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలోని ఐదు డివిజన్ల పరిధిలో మొత్తం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లు ఇలా

డివిజన్	మేల్	ఫిమేల్	ట్రాన్స్‌జెండర్	మొత్తం
షాద్‌నగర్	218	260	1	479
చేవెళ్ల	192	167	-	359
ఇబ్రహీంపట్నం	1,329	802	-	2,131
రాజేంద్రనగర్	632	846	-	1,478
కందుకూరు	2,219	2,020	-	4,239
మొత్తం	4,590	4,095	1	8,686

కొత్త దోస్తీ.. సర్వత్రా ఆసక్తి

- రసవత్తరంగా పెద్ద అంబర్‌పేట రాజకీయం
- పాలకవర్గంలో బయటపడుతున్న వర్గవిభేదాలు
- చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై వ్యతిరేకత
- వేర్వేరుగా జట్టు కడుతున్న సభ్యులు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మెంబర్లు కలిసి క్యాంపులు
- పదిరోజులుగా విహార యాత్రల్లోనే..



పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్ : మున్సిపల్, కార్పొరేషన్ రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. క్యాంపులతో కాక పుట్టిస్తున్నాయి. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘంలో కొత్త గ్రూపులు సర్వత్రా ఆసక్తిగా మారాయి. ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గవిభేదాలు ఒక్కసారిగా బయటకు పొక్కడంతో చర్చనీయాంశమైంది. పాలకవర్గం ఏర్పాటై జనవరి 27 నాటికి మూడేళ్లు పూర్తికావడంతో చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణపై 15 మంది సభ్యులు పార్టీలకు అతీతంగా అవిశ్వాసం కోరుతూ డీఆర్‌ఓ, కమిషనర్‌కు వేర్వేరుగా విజ్ఞప్తి చేయడంతో రాజకీయ వాతావరణం మరింతగా వేడెక్కింది. మొత్తం 24 వార్డుల్లో కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 8, ఇతరులు 3 స్థానాలు దక్కించుకున్నాయి. చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ పీఠాలు కాంగ్రెస్ సొంతం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికీ ఎన్నిక సమయంలో కాంగ్రెస్‌లో రేగిన చిచ్చు బీఆర్‌ఎస్‌కు కలిసివచ్చింది. కాంగ్రెస్‌లోని కొంతమంది సహకారంతో చైర్‌పర్సన్ పదవి బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌లోని ఓ వర్గానికి చెందిన కౌన్సిలర్‌కు వైస్‌చైర్‌పర్సన్ పదవి దక్కిన విషయం తెలిసిందే.

ఏడుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వ్యతిరేకమే..

అవిశ్వాస పర్వం తెరపైకి రావడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన ఏడుగురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోని ఓ వర్గం చెంత చేరారు. అంతా కలిసి క్యాంపుల బాట పట్టారు.

ఎవరికి వారు ప్రయత్నాలు

అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ఎలాగైనా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పీఠాలను దక్కించుకోవాలన్నదే తమ లక్ష్యమంటూ ఓ వర్గం (కాంగ్రెస్-5, బీఆర్ఎస్-7, ఇతరులు-3) సభ్యులు తీవ్రంగా ప్రయత్నిస్తూ తమ పట్టు సాధించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇదే క్రమంలో తమ పీఠాలను కాపాడుకునేందు ప్రస్తుత చైర్‌పర్సన్ చెవుల స్వప్న (బీఆర్ఎస్), వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణ (కాంగ్రెస్)తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఐదుగురు కౌన్సిలర్లు గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. మొత్తం 24 మందిలో 22మంది రెండు గ్రూపులుగా క్యాంపులకు తరలివెళ్లారు. మిగిలిన ఇద్దరు సభ్యులు తటస్థంగా ఉండి అధికారుల నుంచి ప్రకటన వెలువడిన తర్వాతే అడుగు ముందుకు వేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 15 మంది సభ్యులున్న వర్గానికే తమ మద్దతు ప్రకటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులు అవిశ్వాస పరీక్షకు అనుమతిచ్చి తేదీలను ప్రకటిస్తే ఎక్కువ మంది సభ్యుల మద్దతు కూడగట్టుకుని చైర్‌పర్సన్ పీఠాన్ని పండుగుల జయశ్రీకి, వైస్‌చైర్‌పర్సన్ పీఠాన్ని చల్లారి మురళీధర్‌రెడ్డికి కట్టబెట్టడానికి 15 మంది సభ్యులున్న వర్గం ఆలోచిస్తుండగా, అవిశ్వాస పరీక్షలను రద్దు చేయించి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పీఠాలపై తామే కొనసాగాలని ఏడుగురు సభ్యులున్న వర్గం తీవ్రంగా శ్రమిస్తోంది.

ఉనికిని చాటుకునేందుకు పాట్లు

తమ వర్గానికి ఎంతమంది సభ్యులు మద్దతు తెలుపుతున్నారో ఎదుటి వర్గానికి తెలిసేలా విహార యాత్రల్లో (క్యాంపు) ఉన్న రెండు వర్గాల సభ్యులు తమ గ్రూపు ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతూ ఎవరికి వారు తమకు ఉన్న సంఖ్యాబలాన్ని చాటుకునేందుకు పాట్లు పడుతున్నారు.

సమరానికి సై

ఫార్ములా-ఈ పోటీలకు రేసర్లు రెడీ
గెలిచి తీరుతామని ధీమా

సాక్షి, సిటీబ్యూరో: ఫార్ములా- ఈ ప్రిక్స్‌కు వేళయింది. దేశంలోనే తొలిసారిగా నగరం వేదికగా జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు రేసర్లు సమరోత్సాహంతో సన్నద్ధమవుతున్నారు. వీరంతా ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. వివిధ దేశాల్లో నిర్వహించిన ఫార్ములా పోటీల్లో అద్భుతమైన ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించిన 22 మంది రేసర్లు పాల్గొంటారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు రేసర్లు గతంలో నిర్వహించిన పోటీలపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రేసింగ్ డ్రైవర్లు జీన్ ఎరిక్ వర్జిన్, ఆండ్రే లాట్టర్‌లు తమ అనుభవాలను వివరించారు. పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆసక్తికరంగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొనడానికి ముందు ఒత్తిడిని తగ్గించుకొనేందుకు తాను మైకేల్ జాక్సన్ పాటలు వింటానని ఆండ్రే చెప్పారు. రేసింగ్ డ్రైవర్లపై తప్పనిసరిగా మానసిక ఒత్తిడి ఉంటుందని, దానిని అధిగమించేందుకు వివిధ రకాల పద్ధతులను పాటిస్తామన్నారు. వీలైనంత వరకు చుట్టూ ఉండే వాతావరణాన్ని ఆహ్లాదభరితంగా ఉంచుకోనున్నట్లు చెప్పారు. మరోవైపు మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి ఇబ్బందులను అధిగమించేందుకు సైకాలజిస్టులను కూడా సంప్రదిస్తామని చెప్పారు. కాగా.. ఫార్ములా- ఈ పోటీల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నెక్లెస్ రోడ్డులోని 2.8 కి.మీ ట్రాక్‌ను సిద్ధం చేశారు. 20 వేల మందికి పైగా సందర్శకులు వీక్షించేందుకు అనుగుణంగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. 11 ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలకు చెందిన సింగిల్ సీటర్ ఎలక్ట్రిక్ కార్లు, 22 మంది రేసింగ్ డ్రైవర్లు పోటీల్లో పాల్గొనున్న సంగతి తెలిసిందే.

ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- నందిగామ ప్రాథమిక పాఠశాలలో ఘటన



గాయపడిన విద్యార్థి

నందిగామ: పాఠశాలలో తరగతి గది స్లాబ్ పెచ్చులు ఊడి పడటంతో ముగ్గురు విద్యార్థులు గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాఠశాలలో 5వ తరగతి వరకు సుమారు 34 మంది విద్యార్థులు ఉన్నారు. గురువారం తరగతులు కొనసాగుతుండగా 4వ తరగతి గదిలో ఒక్కసారిగా స్లాబ్ పెచ్చులు ఊడిపోయి విద్యార్థులపై పడిపోయాయి.దీంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో నిఖిల్, అభయ్, తేజ ఉన్నారు. ఈ విషయమై ఎంఈఓ కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. జరిగిన ఘటన వాస్తవమేనని అన్నారు. స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఒక విద్యార్థికి స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించామని, మరో ఇద్దరిని షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించి సీటీ స్కాన్ సైతం తీయించామని చెప్పారు. ఎవరికీ ప్రమాదం లేదని పేర్కొన్నారు.

లోక్‌అదాలత్‌లతో సత్వర న్యాయం

చేవెళ్ల: లోక్‌అదాలత్‌లతో సత్వర న్యాయం పొందవచ్చని, రాజీమార్గం ద్వారానే కేసులు పరిష్కారమవుతాయని రిటైర్డు జడ్జి సాంబశివరావు అన్నారు. మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 కేసులు పరిష్కరించినట్లు గురువారం తెలిపారు. దీంతో పాటు పిటీ కేసులు 401 పరిష్కారమయ్యాయని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి చర్యలు తప్పవన్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పెండింగ్ కేసులను ఈ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్‌ఐ చందర్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.



చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్

మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

మంత్రి సత్యవతి రాథోడ్‌కు సంఘం నాయకుల వినతి

చేవెళ్ల: గ్రామాల్లో ఉన్న మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకులు కోరారు. గురువారం నగరంలోని మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తించాలని అ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మినీ అంగన్‌వాడీలో టీచర్, ఆయా పనులు చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో చిన్నచిన్న తండాలను సైతం పంచాయతీలుగా మార్చిన కేసీఆర్ మినీ అంగన్‌వాడీలను కూడా ఎలాంటి షరతులు లేకుండా ప్రధాన అంగన్‌వాడీలుగా గుర్తించాలని కోరారు. చాలీచాలని జీతాలతో మినీ అంగన్‌వాడీ టీచర్లు కాలం వెల్లదీస్తున్నారన్నారని చెప్పారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.వరలక్ష్మి, రంగారెడ్డి జిల్లా మినీ అంగన్‌వాడీ అధ్యక్షురాలు భారతి, సభ్యులు మహేశ్వరి శంకరమ్మ, హేమలత, శమంత, అనురాధ పాల్గొన్నారు.



మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మినీ అంగన్‌వాడీ సంఘం నాయకులు

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘట శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాపురం–బీడీఏ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డు పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తి(70) అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్లు కనుగొన్నారు. మృతుడు పక్షవాతంతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



భవాని కాలేజ్ జట్టు



ఎమ్‌ఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ జట్టు

హోరాహోరీగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ పోటీలు

నేటి ఉదయం సెమీ ఫైనల్..మధ్యాహ్నం ఫైనల్స్

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

పోచారం: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ నుండి 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతలు వీరే..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

- మొదటి మ్యాచ్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అనంతరం లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 9.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 74 పరుగులే చేసి ఓడిపోయింది.
- రెండో మ్యాచ్‌లో శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాల ఏ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. అనంతరం భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 7 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులు తీసి శ్రీఇందుపై విజయం సాధించింది. భవన్స్ బ్యాట్స్‌మెన్ నితీష్ 15 బంతుల్లో 30 పరుగులు తీసి ప్రతిభ చాటుకున్నాడు.
- మూడో మ్యాచ్‌లో జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 57 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టుపై భవన్స్ ఏ జట్టు 2 వికెట్లు కోల్పోయి 6 ఓవర్లలో 58 పరుగులు చేసి సెమీ ఫైనల్‌కు చేరింది.

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. ఈ జట్టుతో తలపడిన విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 51 పరుగులు మాత్రమే చేసి ఓటమి నమోదు చేసింది.
- రెండో మ్యాచ్‌లో ఎమ్‌ఎల్‌ఆర్‌ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. ఇందులో బ్యాట్స్‌మ్యాన్ నితిన్ 35 బంతుల్లో 99 పరుగులు తీసి సత్తా చాటారు. దీనిపై ఎమ్ఆర్ఈసీ ఏ జట్టు ఆడి 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసి ఓటమి పాలైంది.

నేటి మ్యాచ్‌లు..

- శుక్రవారం సీనియర్ విభాగంలో ఎమ్‌ఎల్ఆర్ ఐటీ వర్సెస్ వేద డిగ్రీ కాలేజ్, ఎస్‌పీ కాలేజ్ వర్సెస్ భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్ల మధ్య సెమీ ఫైనల్స్ జరుగుతాయి. జూనియర్ విభాగంలో భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కళాశాల వర్సెస్ గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు ఫైనల్స్‌లో తలపడుతాయి.


హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

మహిళలకు న్యాయమూర్తి శ్రీదేవి హితబోధ

హయత్‌నగర్: ప్రతి మహిళ తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్‌పై గురువారం హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో యువతులు, మహిళలు ఎన్నో వేధింపులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉమెన్ కమిషన్ తగిన సహాయ సహకారాన్ని అందిస్తుందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న యాసిడ్ దాడులు, వరకట్న వేధింపులు గృహహింస, లైంగిక వేధింపులు సమస్యలను చట్టపరంగా ఎదుర్కొనేందుకు అండగా నిలుస్తుందని తెలిపారు. మహిళల హక్కులు, ప్రాథమిక బాధ్యతలపై దేశవ్యాప్తంగా సదస్సుల ద్వారా ప్రచారం చేస్తూ మహిళలను జాగృతం చేస్తుందన్నారు. మహిళలకు ఉచితంగా న్యాయ సహాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మహిళలకు అందుతున్న న్యాయ సహాయం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్‌లుగా న్యాయవాదులు శ్యామలాదేవి, అనితారాణిలను నియమించారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీదేవి





మోదుగ పూలు విరబూసె..

షాబాద్ మండలం నారెడ్లగూడ, కక్కులూర్, అస్పల్లిగూడ, నాగరకుంట, గ్రామాల సమీపంలో మోదుగ పూత విరగబూసింది. ఆకులు రాలి మోడువారిన మోదుగ చెట్లకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. - షాబాద్

ఉపగ్రహ వాహక నౌకపై విద్యార్థులకు అవగాహన

వివరించిన శాస్త్రవేత్త రఘునందన్

- నాదర్‌గుల్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం
- లాంచ్ వెహికల్‌ను తిలకించేందుకు ఏర్పాట్లు

బడంగ్‌పేట్: ఉపగ్రహ వాహక నౌక పనితీరుపై మండలంలోని నాదర్‌గుల్ వంశీధర్ స్కూల్ విద్యార్థులకు ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్, శాస్త్రవేత్త రఘునందన్ అవగాహన కల్పించారు. శుక్రవారం భారత్ ప్రయోగించనున్న మూడు ఉపగ్రహాల గురించి గురువారం పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ గురించి తెలియజేశారు. ఉదయం 9గంటల 18 నిమిషాలకు ఎస్ఎస్ఎల్‌వీ నింగిలోకి దూసుకుపోతుందన్నారు. 450 కిలోల బరువు గల 3 ఉపగ్రహాలను ఈ వెహికల్ 11 నిమిషాల్లో కక్ష్యలో ప్రవేశ పెడుతుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. జానూస్ (జేఏఎన్‌యూఎస్)–01, అలాగే అజాదీ షాట్ - 02, ఈఓఎస్ -07 అనే మూడు ఉపగ్రహాలు నిర్దేశించిన కక్ష్య నుంచి భూ గ్రహాన్ని పరిశీలిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు రఘునందన్ విలువైన సమాధానాలు ఇచ్చి వారిని ప్రోత్సహించారు. శుక్రవారం ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశపెట్టనున్న ఎస్ఎస్ఎల్‌వీ లాంచ్ వెహికల్‌ను విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించేందుకు ఆయా తరగతి గదుల్లో స్క్రీన్లు ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. జీవన గమ్యాలను నిర్ధారించుకునే విధంగా విద్యార్థులను ప్రోత్రహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది డీఎ గోదా లక్ష్మీ, ప్రిన్సిపాల్, అడ్మినిస్ట్రేట్ అధికారి మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లో వంశీధర్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రఘునందన్

స్కూటీని ఢీకొన్న లారీ

అక్కడికక్కడే భార్య దుర్మరణం

- ప్రాణాలతో బయటపడిన భర్త
- మేకగూడ శివారులో ఘటన

నందిగామ: స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మేకగూడ శివారులో జేపీ దర్గారోడ్డులో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేకగూడ గ్రామానికి చెందిన రాశుల నర్సింహ, రాశుల కావేరి(30) దంపతులు. వీరు తమ స్కూటీపై జేపీ దర్గాకు వెళ్తుండగా వెనక నుంచి లారీ అతివేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో భర్త ఎడమ వైపునకు పడిపోగా, భార్యపై లారీ వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయింది. భర్త నర్సింహ రోడ్డుకు ఎడమ వైపునకు పడిపోవడంతో ఎలాంటి గాయాలు తగలకుండా బయటపడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



కావేరి (ఫైల్)